# కథ

# కథ చెక్కిన కథ

ఎన్నాళ్ళ నుంచో రాద్దామనుకుంటున్న కథను కాగితం మీద పెట్టటానికి ఈరోజు తీరిక దొరికింది.

''ఇవాళ ఎటూ ఆదివారం- ఆఫీసుకు సెలవు కనుక ఏమైనా సరే కథ రాయటం, ఫెయిర్ కాపీ చేయటం- రెండూ అయిపోవాలి'' అనుకున్నాను.

మామూలుగా బద్ధకస్తుడిని అయిన నాకు ఈ నిర్ణయం మోటారు సైకిల్ కిక్‌లాగా పని చేసింది. పెందలాడే లేచాను.

లేస్తూనే ''ఏమోయ్! స్నానానికి నీళ్లు తోడు'' అని బెడ్‌రూమ్ లోంచే మా శ్రీమతికి పురమాయించాను.

''ఇదేంటండీ ఇవాళ ఈ విపరీతం! రోజూ ఏడున్నర అయితేగాని నిద్ర లేవని పెద్దమనిషి ఇలా పొద్దున్నే ఐదున్నరకే ఈ లేచి కూర్చోటమేమిటి? కాలకృత్యాలు, కాఫీ పానాలు కూడా కాకుండా స్నానానికి నీళ్లు తోడమనటమేమిటి? మీకేమీ మతిగానీ పోలేదుకదా!'' కొంచెం నవ్వు, మరికొంచెం ఆశ్చర్యం మేళవిస్తూ అడిగింది శ్రీమతి వంటింట్లోంచి బ్రష్, టూత్ పేస్టు తీసుకొస్తూ.

ఆ ప్రశ్నతో నా తొందరపాటు నాకు తెలుసొచ్చి నాలో నాకే నవ్వు వచ్చింది.

నేనొక సెంటిమెంటల్ మనిషిని. ఈరోజు లేస్తూనే నా నోటి నుంచి వచ్చిన మాట ఒక విమర్శనాత్మక ప్రశ్నను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇక ఇలాంటి రోజున రాసిన కథ బ్రతికి బట్టకట్టగలదా? అసలు పూర్తవుతుందా? కాదు- కనీసం ప్రారంభం అవుతుందా? ఒక వేళ రాసి పత్రికకు పంపించినా ప్రచురణకు నోచుకుంటుందా? ఒక వేళ ప్రచురణ అయినా ఎన్ని విమర్శలకు గురి అవుతుందో? ఛీ! ఈరోజున శకునం బాగుండలేదు. ఇంకో- సెలవు రోజున తీరిగ్గా కూర్చొని- అదీ మంచి రోజు చూసుకుని ఆరోజున రాద్దాం. మళ్లీ సెలవురోజు ఎప్పుడు? వచ్చే ఆదివారం. ఆరోజున తిథి ఏమైంది?

వెంటనే క్యాలెండరు చూశాను. వచ్చే ఆదివారం ద్వాదశి అయింది. ద్వాదశి దగ్ధ యోగం అన్నారు. ఆరోజు అసలు పనికి రాదు. పోనీ ఆపై ఆదివారం? 28వ తేదీ అయింది. ఛ! అసలు పనికి రాదు. తీన్, తేరా, ఆఠ్, అఠారా-3, 8 ఉన్న తారీకులు శుభమైనవి కావంటారు. పోనీ ఆపై ఆదివారం? అమో! ఆరోజున డిపార్ట్‌మెంటల్ టెస్టు ఒకటి రాయాలి. అసలు కుదరదు.

ఏమైనా సరే ఈ ఆదివారం సెలవురోజుననే కథ రాసెయ్యాలి. పైగా ఈరోజు పంచమి. బాగుంది. పంచమి అంటే ఐదుకు సంబంధించింది. అయిదు అంటే పాండవుల సంఖ్య. పాండవులు అంటే విజయానికి మారుపేరు. కనుక ఈ పంచమే నా కథారచనా విజయానికి యుక్తమైనది.

ఇలా ఆలోచిస్తూ గబగబా కలాకృత్యాలు, స్నానసంధ్యలు, టిఫిన్- కాఫీలు అన్నీ ముగించుకుని కలం తీసుకుని కాళిదాసు పోజులో కథా రచనకు ఉపక్రమించాను.

ఎన్నాళ్ళ నుంచో ఆలోచించుకుని పెట్టుకున్న ప్లాటు మనసులో సిద్ధంగా వచ్చి నిల్చుంది. అయితే కథకు పేరేమి పెడదామా అని ఆలోచనలో పడ్డాను. పేరు మాత్రం ఇన్నాళ్లూ ఆలోచించలేదు. ఇప్పుడు అక్షర రూపంలో పెడుతున్నాను గనక పేరు ఆలోచించాల్సి వచ్చింది.

ఎన్నో పేర్లు ఆలోచించాను. ఏ పేరూ నేనూహించి పెట్టుకున్న కథకు సరిగ్గా సరిపోవటం లేదు.

పోనీ పేరు తర్వాత వ్రాద్దాంలే ముందు కథ వ్రాయటం పూర్తి చేద్దామనుకున్నాను. కానీ ఎందుకో నాకు అలాగూ మనస్కరించటం లేదు. పేరును బట్టి కథా? కథను బట్టి పేరా? మనం ముందు పైన శీర్షికగా కథ పేరు వ్రాసిన తర్వాతే కదా కథ రాసేది! అసలు పేరును బట్టే కదా కథ పాఠకులను ఆకర్షించేది!

ఆదికవి నన్నయ్య దగ్గరి నుంచి కూడా అందరూ తాము రాయదల్చుకున్న పుస్తక నామం, బారసాల అన్నీ యధావిధిగా పూర్తి చేసుకున్న తరువాతనే కావ్యాలను రాసారు. చాలామందికైతే సాక్షాత్తూ వాళ్ల ఇష్టదైవమే కలలో కనిపించి ఫలానా కథ, ఫలానా కావ్యం రాయమని చెప్పటం ఆరోజుల్లో దేవుళ్లకు ఫ్యాషన్ కూడా!

కానీ మరో వైపు నుంచి ఆలోచిస్తే కథ పూర్తిగా రాశాక, దాన్ని పూర్తిగా అన్ని కోణాల్లోంచీ తనకు తానుగా విమర్శించుకుని ఒక సలక్షణమైన తుది రూపానికొచ్చాక అప్పుడు కదా దానికి ఒక మంచి పేరు పెట్టుకునేది ఏ రచయితైనా!

ఆలీ లేదు చూలీ లేదు కొడుకు పేరు సల్మాన్ ఖాన్ అన్నట్టుంది పేరు గురించి నేనాలోచించటం.

చివరకు- అలా అలా ఓ అరగంట ఆలోచించి- పేరు తరువాత రాద్దాంలే అని నిర్ణయించుకుని ముందు కథ రాయటానికే నిర్ణయించుకున్నాను.

అలా నిర్ణయించుకుని మొదటి అక్షరం రాశానో లేదో-

''సార్! టెలిగ్రాం'' వాకిట్లోంచి అరుపు.

నా మూడ్ అంతా వేటగాని తుపాకీ పేలుడు మోతకు పక్షులు అన్నీ ఒక్కసారిగా పైకి ఎగిరిపోయినట్టుగా చెదిరిపోయాయి.


లేచి వరండాలోకెళ్లి సంతకం పెట్టి టెలిగ్రాం తీసుకుని ఓపెన్ చేసి చూశాను.

''గ్రాండ్ మదర్ కమింగ్ సన్డే మెయిల్ రిసీవ్'' నాన్న ఇచ్చిన టెలిగ్రామ్. ఒళ్లుమండిపోయింది. బామ్మకేం పని లేదు. ఇవ్వాళే రావాలా? ఛీ! ఇప్పుడేం ముంచుకొచ్చిందో అంత తొందర! ఈ బామ్మ ఆప్యాయత కాదుగాని, చస్తున్నాను. ప్రతి సంవత్సరం నా పుట్టిన రోజు పండుగకు మూడు రోజులు ముందుగా రావటం, ఆ డేటు నాకు గుర్తు ఉన్నా, ''పిచ్చి నాయన పుట్టిన రోజు కూడా సరిగ్గా గుర్తు పెట్టుకోడు. నా కన్నారి మనవడికి నేను బ్రతికున్నంత వరకు, ప్రతి ఏడూ నేనే తలంటిపోసి, పరమాన్నం వండిపెట్టి పండుగ చేయాలి'' అంటూ పాత రికార్డే ప్రతిసారీ పాడుతూ, నా పుట్టిన రోజు పండుగ జరిపి, తెగ మురిసిపోయి, నాకు ముప్పై రెండేళ్లు వచ్చినా ఇంకా నేను పండంటి పసి పాపాయినే అన్నట్టు, రాత్రి పడుకోబోయే ముందు నాకు దిష్టి తీయటం, ఆ తరువాత ఇంకో నాలుగు రోజులుండి ''మళ్లీ వచ్చే యేడు వస్తారా నాయనా నే బతికుంటే'' అంటూ మా నాన్న దగ్గరకు వెళ్లిపోవటం మా బామ్మకు ఆనవాయితీ.

టయిము చూశాను. సరిగ్గా ఎనిమిదిన్నర అయింది. మెయిల్ సరిగ్గా మిట్ట మధ్యాహ్నం 12 గంటలకొస్తుంది. ఈలోపల కథ రాయాలి. రాసి, ఫెయిర్ కాపీ చేయాలి. చేసి, పోస్టు చేయాలి. మళ్లీ బామ్మ వస్తే కుదరదు. బామ్మ వస్తే ఒకటే కబుర్లు. నన్ను రాసుకోనివ్వదు. అమ్మా, నాన్న వాళ్ల సంగతులు, మా తమ్ముళ్లు, చెల్లెళ్లు, వాళ్ల చదువులు, వాళ్ల కోసం అమ్మ నాన్న చూస్తున్న పెళ్లి సంబంధాలు అన్నీ ఏకరువు పెడుతూ కూర్చుంటుంది. బామ్మ వస్తే ఇక మా చిట్టి, మా బాబ్జీ వేసే గంతులు, సంబరంతో చేసే అల్లరి నన్ను కథ రాసుకోనివ్వవు.

అందుకని 11 గంటలకల్లా కథ పూర్తి చేసి స్టేషన్‌కెళ్లాలి. టెలిగ్రాం మా శ్రీమతికిచ్చేసి మళ్లీ కలం, కాగితాలు పట్టుకుని ఉపక్రమించాను.

''ఏమండీ! ఏమిటిది? మీ సరికిమీరు ఇలా ఏదో రచనా వ్యాసంగంలో కూరుకుపోయి ఉంటే సరిపోతుందా? ఇంట్లో ఒక్క కూరలేదు. ఈ పూట ఏమి వండాలి? ఏం తినాలి? మార్కెట్టుకు పోయి ఏమైనా తీసుకురండి తొందరగా. నాకు కూరలు తెచ్చిచ్చిన తరువాత మీరేమైనా రాసుకుంటూ కూర్చోండి. మిమ్మల్ని నేను కదిలించను. పైగా ఈరోజు మీ బామ్మ కూడా వస్తున్నారు. ఏదో పచ్చళ్లు వేసుకు తిందాంలే అనుకోవటానికి కుదరదు. మీ బామ్మగారికి పప్పు, కూర లేకపోతే ముద్ద దిగదు. పైగా నేను రోజూ ఇలాగా మీకు పచ్చడి మెతుకులు చేసి పెడుతున్నానని అనుకోగలదు. అసలే మీరంటే మీ బామ్మకు ఎంతో గారాబం. తర్వాత మీ బామ్మ సాధిం



పులు నేను భరించలేను'' అంటూ కొంచెం మూతి ముడుస్తూ మా శ్రీమతి దెప్పి పొడిచింది.

అప్పటికి నా కథా రచనలో కేవలం రెండో అక్షరం కాగితం మీద పడుతోంది. నాకు అరికాలి మంట నెత్తికెక్కింది.

''ఇదిగో మేడమ్! ఇంట్లో ఉన్న అప్పడాలు, వడియాలు, ఊరగాయలు, దోస ఒరుగు, కంది సున్ని, కారప్పొడి గట్రా ఈ పూటకు చాలు. వాటితో సరిపెట్టండి. ఇక మా బామ్మ సంగతంటావా? అది నేను చూసుకుంటాను. నీ మీద ఏ విమర్శనాస్త్రాలు, సాధింపుల శస్త్రాలు మా బామ్మ విసరకుండా చూసే పూచీ నాది. నీవు నిశ్చింతగా ఉండు. ఆ అన్నం ఒక్కటీ వండి పడేసి, అంత చారు పెట్టేసెయ్ చాలు...'' కళ్లల్లో చిరుకోపం, పెదవుల మీద చిరునవ్వు విచిత్రంగా మేళవించి మా శ్రీమతితో చెప్పాను. ఆవిడ మూతి ముడుచుకుని వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఓ రెండు పేరాలు రాశాను. పెన్నులో సిరా అయిపోయింది. ''ఛీ. దరిద్రప్పెన్ను. ఇప్పుడే సిరా అయిపోవాలా దీని తాత సొమ్మంతా పోయినట్టు'' అనుకుంటూ కుర్చీ లోంచి లేచాను. సిరా బుడ్డి తీసుకుని చూశాను. అదీ నిండుకుంది. చిరాకేసింది. సిరాబుడ్డి కిటికీలోంచి బయటకు విసిరేశాను.

''బాబ్జీ!'' గట్టిగా పిల్చాను.

''ఏం నాన్నా?'' వస్తూనే అడిగాడు మా అబ్బాయి.

''నీ బాల్‌పాయింట్ పెన్ను ఓసారి ఇవ్వు నాన్నా. మళ్లీ ఇస్తాను'' ఆశగా అడిగాను.

''లేదు నాన్నా. నిన్న క్లాసులో తానేదో రాసుకోవాలి, మళ్లీ ఇస్తాను, నీ పెన్నోసారి ఇవ్వరా అని మా క్లాస్‌టీచర్ తీసుకున్నారు నాన్నా'' అన్నాడు బాబ్జీ.

**నాకు మతిపోయింది. ఏం చేయాలో తోచటం లేదు. నాకసలే సెంటిమెంట్లు ఎక్కువ. నేను కథకు పూనుకోవటం, మా ఆవిడకు తేలు కుట్టటం, మా బామ్మ అన్న మాటలు అన్నీ కలిపి ఆలోచించేసరికి నాకు పిచ్చెత్తినట్టు అయింది. కథారచన వాయిదా వేసుకుని హాయిగా కాసేపు పడుకుని నిద్రపోయాను.**

వాడి మాటలకు ఏమనాలో నాకు తోచలేదు. రెండు క్షణాలు ఆగి వాడు ఆడుకోటానికి వెళ్లిపోయాడు.

''చిట్టీ!'' పిల్చాను మా అమ్మాయిని. మా చిట్టి వచ్చింది. ''నీ పెన్ను ఒకసారి ఇస్తావమ్మా?'' అడిగాను.

''నిన్న కిందపడి పాళీ చిట్లి పోయింది నాన్నా'' బెదురుతూ సమాధానం చెప్పింది.

''ఛీ! యూస్లెస్ గర్ల్'' విసుక్కున్నాను. చిట్టి బిక్క మొహంతో వెళ్లిపోయింది.

ఎలా ఇప్పుడు? కథ రాయాలి? టైము చూశాను. తొమ్మిదిన్నర అయింది. పదకొండు కల్లా స్టేషనుకెళ్లాలి బామ్మ కోసం. ఎక్కువ టైము లేదు. ఏం చేయాలి?

**శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం**

ఈరోజు ఆదివారం. షాపులూ ఉండవు సిరా కొని తెచ్చుకుందామనుకుంటే. ఎటూ పాలుపోవటం లేదు. నన్ను, మా బామ్మను, పిల్లల్ని తిట్టుకుంటున్నాను. ఏ ఉపాయమూ తోచటం లేదు.

కానీ ఆలోచించగా ఓ తరుణోపాయం తట్టింది.

''చిట్టీ!'' పిల్చాను మళ్లీ.

''ఏం నాన్నా?'' మా అమ్మాయి వచ్చి నిల్చుని అడిగింది.

''నీ పెన్నులో సిరా ఉందా?''

''ఉంది నాన్నా''

''అయితే అది నా పెన్నులో పొయ్యమ్మా''

వెంటనే చిట్టి ఆ పని చేసి వెళ్లిపోయింది.

మళ్లీ పెన్ను పట్టుకున్నాను. ఒక వాక్యం రాశానో లేదో 'అమ్మో' అంటూ వంటింట్లోంచి శ్రీమతి పెద్ద కేక.

''అబ్బా! ఏమండీ! తేలండీ. తేలు కుట్టిందండి. అబ్బా నొప్పి, అమ్మా నొప్పి. రండి త్వరగా రండీ'' విలవిలలాడిపోతోంది. వెంటనే పెన్ను, పేపరు పక్కన పెట్టి వంటింట్లో వాలాను.

గోడ వారగా ఒక తేలు జరజరా పాకుతూ పోతోంది. కోడి కోడి కోడి అంటూ అరుస్తూ ''చిట్టీ! చెప్పు తీసుకురావే తొందరగా'' అంటూ మా అమ్మాయిని కేకవేశాను ఆదుర్దాతో. అది తెచ్చి యిచ్చింది. ఒక దెబ్బతో తేలును చంపేశాను.

వెంటనే మా ఇంట్లో ఉన్న తేలు మందు మా ఆవిడకు రాసి, శైత్యోపచారాలు చేయసాగాను. ఆ తేలు కుట్టిన బాధ నుంచి, ఆవిడ గారు తేరుకోవటానికి ఓ గంట పట్టింది. ఉడుకుతున్న అన్నం పూర్తిగా ఉడికే దాకా ఉండి, దాన్ని దించటం, దోస

ఒరుగు వేపుడు, అప్పడాలు కాల్చటం, చారు పెట్టటం అన్నీ నా నెత్తిన పడ్డాయి.

ఈలోపల టైమ్ మెల్లిగా పదకొండున్నర అయింది. మెయిల్ వచ్చే టైము సమీపిస్తోంది.

"ఇక స్టోరీ రాయటం ఈ పూటకు కుదరదు. తరువాత చూసుకోవాల్సిందే అనుకుంటూ శ్రీమతి దగ్గర ఉపచారాలకు పిల్లల్ని ఉంచి, డ్రెస్ చేసుకుని సైకిల్ తీసుకుని వీధిలోకి అడుగు పెట్టాను.

ఇంతలో రిక్షాలో మా బామ్మే నాకు ఎదురొచ్చింది. నేను తప్పు చేసిన వాడిలాగ తల దించుకున్నాను.

"రైలు అరగంట ముందొచ్చిందిరా అబ్బాయి ఈరోజు. ప్లాట్‌ఫారం మీద నీకోసం చూశాను. ఇంకా నీవు స్టేషనుకు చేరుకోలేదు కాబోలు అనుకుని నేనే రిక్షా మాట్లాడుకుని వచ్చేశానురా" అంది బామ్మ.

సరే ఎలాగైతేనేం క్షేమంగా చేరింది కదా ...హమ్మయ్య అనుకున్నాను.

బామ్మ మా ఆవిడకు తేలు కుట్టిన వైనం తెలుసుకుని ఎంతో బాధ పడింది. మంత్రం వేసింది. సరే వాళ్లేదో కబుర్లలో పడ్డారు.


"అన్నాలు తిని మాట్లాడుకుందాం" అన్నాను. భోజనాలైనాయి.

మళ్లీ నా వ్రాత పనిలోకి నేను దిగాను. ఇంతలో మా బామ్మ నా గదిలోకి వచ్చి చూసింది-ఏం చేస్తున్నానో చూసిపోదామనో, మా నాన్న వాళ్ల కబుర్లు చెబుదామనో.

"ఏమిట్రా అబ్బాయ్ రాస్తున్నావ్?"

"ఓ కథ బామ్మా!"

నా సమాధానం విని ఎందుకో మరి మా బామ్మ కొంచెం ముఖం చిట్లించింది.



"ఒరేయ్! కథంటే గుర్తొచ్చింది. మన వంశానికి సాహిత్యం అచ్చి రాలేదురోయ్. మీ తాతయ్య కథలు రాస్తూనే నడి వయసులో నాకన్యాయం చేసిపోయారు. మీ నాన్న కాలేజీ చదువుల రోజుల్లో కథ రాద్దామనుకున్నప్పుడల్లా కళ్ల కలక వచ్చేది. అది రాయటం మానుకుంటే వెంటనే తగ్గిపోయేది. అసలు కొన్ని వంశాలకు సాహిత్యం అశుభం కలిగిస్తుందిటరా. నన్నయ గారు అరణ్య పర్వం రాస్తూ చచ్చిపోయారట. తిక్కన గారు కూడా అక్కడి నుంచి రాయటానికి భయపడి అరణ్య పర్వ శేషం తర్వాత రాద్దాంలే అనుకుని, విరాట పర్వం నుంచి చివరిదాకా రాసి, అరణ్య పర్వం రాద్దామనుకుంటూ ఉండగా చనిపోయారట. హరిశ్చంద్ర నాటకం రాసిన బలిజేపల్లి వారు ఎన్నో కష్టాలు పడ్డారట. వేయి పడగలు రాసిన విశ్వనాథ వారికి చిన్న వయస్సులోనే భార్యా వియోగం కలిగిందట. మరి శ్రీనాథుడి సంగతైతే చెప్పనే అక్కరలేదు. పైగా కిందటేడు నేను కాశీ వెళ్లినప్పుడు అక్కడొక సాధువు నాతో ఏమన్నాడో తెలుసా? మీ వంశానికి సాహిత్యం అచ్చిరాదు. మీ మనవడు కథలు అవీ రాస్తుంటాడన్నావు. అతన్ని అవి మానుకోమని చెప్పండమ్మా! లేకపోతే మీరే నష్టపడతారు. తరువాత మీ ఇష్టం అని చెప్పాడురా. నా పిచ్చి నాయనా! ఇలాంటివి రాయబోకురా తండ్రీ" అంటూ మెల్లిగా శోక స్వరం కూడా జోడించింది.

నాకు మతిపోయింది. ఏం చేయాలో తోచటం లేదు. నాకసలే సెంటిమెంట్సు ఎక్కువ. నేను కథకు పూనుకోవటం, మా ఆవిడకు తేలు కుట్టటం, మా బామ్మ అన్న మాటలు అన్నీ కలిపి ఆలోచించేసరికి నాకు పిచ్చెత్తినట్టు అయింది. కథారచన వాయిదా వేసుకుని హాయిగా కాసేపు పడుకుని నిద్రపోయాను.

సాయంత్రం నాలుగు గంటలకు "ఏమండీ కాఫీ తీసుకోండి" అంటూ మా ఆవిడ నిద్ర లేపింది.

లేచి సబ్బుతో మొహం కడుక్కున్నాను. మెదడు ఫ్రెష్‌గా ఉంది. అన్ని సెంటిమెంట్లు, జంకు, ఆలోచనలు నిద్రలో కరిగిపోయాయి.

కాగితం, కలం తీసుకున్నాను. పని మీద ఏకాగ్ర దృష్టి పెట్టుకున్నాను. అనుకున్న ప్లాటు, థీమ్‌ల ఆధారంగా ఒక గంటలో కథ రాసేశాను. పూర్తి అయినాక మళ్లీ మళ్లీ చదువుకున్నాను. ఏమైనా చిన్న చిన్న మార్పులు అవసరమేమోనని. కానీ అవి అవసరం అనిపించలేదు.

కథ బాగా వచ్చింది. సర్వాంగ సుందరంగా వచ్చింది. మా ఆవిడకు, కొంతమంది ఫ్రెండ్సుకు వినిపించాను. అందరూ ఎక్సలెంటుగా ఉంది అన్నారు. కథకు 'తిరిగొచ్చిన కథ' అని పేరు పెట్టాను. ఒక అరగంటలో ఫెయిర్ కాపీ చేశాను. మర్నాడే ఓ పత్రికకు దానిని పోస్టు చేశాను.

వారం రోజులలో నా కథ నాకు తిరిగొచ్చింది. ఆ పత్రిక ప్రచురణ ఆపివేశారట అంతకు ముందు రోజు నుంచే!

★

## నీరాజనాలందుకున్న నకిలీ రచయిత

ప్రపంచ ప్రముఖ ఆంగ్ల రచయితలు చాలామంది వున్నా 'ఆస్కార్ వైల్డ్' ప్రత్యేకత మరొకరికి లేదు. కవిగా, కథకుడుగా, నవలా రచయితగా అతని ప్రత్యేకత అతనిదే.

ఆస్కార్ వైల్డ్ ఒకసారి అమెరికాలో 'సాహితీ యాత్ర' చేస్తుండగా డెన్వర్ అనే ప్రాంతంలో ఆయన కార్యక్రమాలు ఒకరోజు ప్రకటించబడింది.

అయితే యూజీ ఫీల్డ్ అనే పేరున్న పత్రికా విలేకరి ఒక తమాషా చేసాడు. ఇది తరువాత చెప్పి ఆస్కార్ వైల్డ్‌ను క్షమాపణ కోరాడు. అది వేరే సంగతి.

ఆస్కార్ వైల్డ్ నిజంగా మనిషి ఎలా వుంటాడో ఆయన అభిమానులకు ఆ ప్రాంతంలో తెలియదు కాబట్టి 'యూజీ ఫీల్డ్' తనే ఆస్కార్ వైల్డ్‌గా మారువేషంలో తయారయ్యాడు.

తను పత్రికా విలేకరి కాబట్టి ఆస్కార్ వైల్డ్ అనుకున్నరోజున కాకుండా ఒకరోజు ముందుగా డెన్వర్ పట్టణానికి వస్తున్నట్టు పత్రికలో ప్రముఖ వార్త వచ్చేట్టు చేశాడు.

ఆస్కార్ వైల్డ్ అభిమానులు సంబరంగా పూలదండలతో స్వాగత పత్రాలతో కోలాహలంగా రైలుస్టేషన్‌కు చేరారు.

ఆస్కార్ వైల్డ్ వేషంలో పత్రికా విలేకరి సూట్‌కేసుతో చెదిరిపోతున్న తలకురులు సవరించుకుంటూ రైలు దిగాడు.

తమ అభిమాన రచయితను ఇన్నాళ్లకు కలుసుకోవడానికి అవకాశం వచ్చిందన్న సంతోషంతో ఆస్కార్ వైల్డ్ అభిమానులు నకిలీ ఆస్కార్ వైల్డ్‌నే అసలైన రచయితగా భావించి ఘనస్వాగతం చెప్పారు.

నకిలీ ఆస్కార్ వైల్డ్ మెడలో పూలమాలలు వేసారు. ఆయనను హోటల్‌వరకు ఊరేగింపుగా పెద్ద కోలాహలంగా తీసుకెళ్లారు. అభిమానులవైపు ఆనందంగా చేతులు ఊపుతూ నకిలీ ఆస్కార్ వైల్డ్ ఆ కోలాహలం అంతా భరించాడు.

అంతమంది అభిమానుల్ని అలా ఫూల్స్ చేస్తున్నందుకు ఒకప్రక్క బాధగా వున్నా ఆ తమాషా మరోప్రక్క ఆనందం కలిగించింది.

ఇక ఆ రోజు గడిచిపోయింది.

మామూలుగా అనుకున్నరోజున ఖచ్చితమైన సమయానికి అసలు ఆస్కార్ వైల్డ్ రైలుస్టేషన్‌లో దిగేసరికి ఆయనను పలకరించినవాడే లేకపోయాడు. తాను దిగిన ప్రతి పట్టణంలో, నగరంలో ఎంతోమంది అభిమానులు, గొప్ప కోలాహలంగా చుట్టుముట్టి ఊపిరి సలపనీయకుండా ప్రాణం తీసారు. ఈ ఊళ్లో ఇలా ఎందుకు జరిగింది? ఇక్కడ ఒక్క అభిమాని కూడా లేకుండా ఎలా వుంటాడు? ఇదేమిటి? ఇక్కడే ఇలా ఎందుకు ప్రత్యేకంగా ఉంది? ఇంత అవమానం మరోచోట జరగలేదేమిటి?

ఇలా ఆలోచిస్తూ ఒంటరిగా నిలిచిన ఆస్కార్ వైల్డ్ తన సూట్‌కేసు తనే మోసుకుంటూ రైలుస్టేషన్‌నుంచి బయటికి వచ్చి తనే టాక్సీ మాట్లాడుకుని హోటల్‌కు ఆపసోపాలు పడుతూ చేరాడు. హోటల్‌కు చేరిన ఆస్కార్ వైల్డ్‌కు నిజం తెలిసింది.

తను క్రితంరోజే రావడం, అభిమానులు తనకు గొప్పగా ఘనస్వాగతం చెప్పడం, ఊరేగింపుగా హోటల్‌కు తీసుకు రావడం... అన్నీ తెలిసి అది నిజమో వైష్ణవ మాయో అర్థంకాక నిశ్చేష్టుడై నిలబడ్డాడు.

ఏమి చేయాలో తోచక మతిపోయిన నిలబడ్డ ఆస్కార్ వైల్డ్‌కు నకిలీ ఆస్కార్ వైల్డ్ పాత్ర పోషించిన విలేఖరి వచ్చి కాళ్లమీద పడి క్షమాపణ చెప్పి ఉంటాడని వేరే చెప్పవలసిన పని లేదనుకుంటా!

-ఎం.డి.సౌజన్య